క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలో విద్యార్థులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమాచార హక్కు చట్టం 20 ఏళ్ల వేడుక సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయ లక్ష్మి, ఎం.అనిత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు నాగ బాబు, గణేష్, ఎస్.అప్పారావు, బి.లచ్చన్న, ఎస్.సోంబాబు, రాజు, సురేష్, అంబికా, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

300 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు


విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: ప్రస్తుతం వర్షాలు కారణంగా వాతావరణంలో మార్పులు వస్తుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలల్లో విద్యార్థులకు హిమోగ్లోబిన్, సికిల్‌సెల్, మలేరియా వంటి రక్త పరీక్షలు చేస్తున్నట్టు వైద్యాధికారి పి.రాంబాబు చెప్పారు. స్థానిక కేజీబీవీలో సుమారు 300 మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. కాచి చల్లార్చిన నీరుని అందించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రిన్సిపాల్ కె.భవాని, వైద్యసిబ్బంది, ఎంపీహెచ్ఈవో సన్యాసిరావు, హెచ్‌వి కుమారి, హెల్త్ అసిస్టెంట్ స్వామి, ఎమ్ఎల్‌హెచ్‌పీ ఏఎన్ఎమ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాధ

వై.రామవరం: పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సీఆర్‌పీఎఫ్ జీ42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.రాధ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. హెచ్‌ఎం పల్లాల లక్ష్మణరెడ్డి, వార్డెన్ శ్రీనివాసరావు, విద్యార్థులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం


మేకలకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది, పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి రమేష్

గూడెం కొత్తవీధి: గిరిజన రైతులు పశువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి లోకుల రమేష్ అన్నారు. మండలంలోని దామనాపల్లి పంచాయతీలో పలు గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. గ్రామంలో 2-గోకులాలు, 13-నీటి తొట్టిలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో 20-మేకలు, 15-గొర్రెలు, 8-ఆవులకు వైద్యం అందించారు. ఇందులో భాగంగా 85-మేకలు, 50-గొర్రెలకు టీకాలు వేసినట్టు పశు వైద్యాధికారి లోకుల రమేష్ చెప్పారు. ఏహెచ్ఎ జయరాజ్ తదితరులున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని గురుకుల పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు డాక్టర్ రాజశేఖర్ కోరారు. మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి విశ్వహిందూ పరిషత్ మండల శాఖ అధ్యక్షుడు శరగడం పరదేశినాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేసుకోవాలన్నారు. భక్తి భావాలను పెంచుకోవాలన్నారు. హిందూ ధర్మాన్ని పాటించేలా అవగాహన చేసుకోవాలన్నారు. అనకాపల్లి సర్వశిక్ష అభియాన్ ప్రతినిధి కర్రి జోగినాయుడు మాట్లాడుతూ అందరికీ దైవభక్తి అవసరమన్నారు.

జోరుగా సాగు

- 2,400 ఎకరాల్లో సిల్వర్‌ఓక్ సాగు
- 40 ఎకరాల్లో ప్లాంటేషన్
- ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి


పెదలబుడులో మొక్కలు వేసేందుకు సిద్ధం చేస్తున్న కొండ ప్రాంతం

అరకులోయటౌన్: పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి సరిగా లేక ధరలు ఆకాశానంటుతున్నాయి. దిగుబడులు తగ్గడంతో మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. ఏజెన్సీలో వరి, సిరిధాన్యాల సాగుకు ప్రత్యామ్నాయంగా పండ్లు, ఉద్యాన తోటల సాగు విస్తారంగా చేపడుతున్నారు. గిరిజనులు తమ పట్టా భూముల్లో సిల్వర్‌ఓక్, జీడిమామిడి, నిమ్మ, సపోట తదితర ఉద్యాన పంట పెంపకం చేస్తున్నారు.

మొక్కల పంపిణీ

అరకులోయ మండలంలో 2024-25వ ఆర్థిక సంవత్సరంలో 347 ఎకరాల్లో సిల్వర్‌ఓక్, 450 ఎకరాల్లో సపోటా మొక్కలు పంపిణీ చేశారు. 2025-26లో 2,400 ఎకరాల్లో సిల్వర్‌ఓక్ మొక్కలు నాటే లక్ష్యం కాగా 2,00 ఎకరాలకు ఎస్టిమేట్ చేయగా, 40 ఎకరాల్లో ప్లాంటేషన్ చేసినట్లు అధికారులు తెలిపారు.

అంతర పంటల సాగు

గిరిరైతులకు సిల్వర్‌ఓక్ మొక్కల పెంపకాలనికి ఆశక్తి చూపిస్తున్నారు. మూడేళ్ల వరకు మొక్కల పెంపకానికి రైతులకు ప్రోత్సాహక నిధులు అందిస్తున్నారు. దీంతో అంతర పంటగా ముఖ్యంగా కాఫీ, మిరియాలు, ఫైనాపిల్, సపోట సాగుకు ఈ ప్రాంత వాతావరణం అనువుగా ఉండడంతో రైతులు ఆయా ఉద్యానపంటల సాగుపై ఆశక్తి చూపుతున్నారు. గతంలో ఎకరా విస్తీర్ణంలో 700 సిల్వర్‌ఓక్ మొక్కలు నాటేందుకు రైతులకు పంపిణీ చేయగా, ఈ ఏడాది నుంచి ఎకరా విస్తీర్ణంలో 450 మొక్కలు పంపిణీ చేస్తున్నారు. సిల్వర్‌ఓక్ మొక్కలు నాటిన భూమి చుట్టు వేసేందుకు 100 మహాగని మొక్కలు అందజేస్తున్నారు. ఉద్యాన పంటల సాగుపై గిరిజన రైతులు అవగాహన పెంచుకోవడంతో ప్రతీ గ్రామంలో ప్రతీ కుటుంబం కనీసం అర ఎకరం విస్తీర్ణంలో సిల్వర్‌ఓక్ మొక్కలు వేసుకొని అంతర పంటల సాగుకు ఆశక్తి చూపుతూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇప్పటికే అనేకమంది గిరిరైతులు సిల్వర్‌ఓక్ సాగులో అంతర పంటగా కాఫీ, మిరియాలు పంట పండిస్తూ ఆర్థిక లాభాలు పొందుతున్నారు.

వాతావరణం అనుకూలం

సిల్వర్‌ఓక్ మొక్కలు నాటడానికి జూలై, ఆగస్టు నెలల్లో వాతావరణం అనుకూలమని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. సిల్వర్‌ఓక్ మొక్కలు నాటడానికి 45 రోజుల ముందే గుంతలు తవ్వాలి, అడుగున్నర లోతు, పొడవు, వెడల్పు సమానంగా ఉండాలి. మొక్క, మొక్కకు దూరం ఏడు అడుగులు ఉండాలి. నాటేటప్పుడు గుంతలో పశువుల పెంట వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


గిరిరైతులకు సిల్వర్ ఓక్ మొక్కలు పంపిణీ చేస్తున్న ఏపీవో జగదీశ్వరరావు


కొత్తవలస గ్రామంలో మొక్కలు నాటేందుకు గోతులు తవ్వుతున్న గిరిరైతులు

ఆర్థిక ఆదాయం



గిరిరైతులకు ఆదాయం సమకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం సిల్వర్‌ఓక్ మొక్కల పెంపకాన్ని ప్రొత్సహిస్తుంది. ఎకరా పొలంలో సిల్వర్ ఓక్ నాటుతున్నాను. గుంతలు తవ్వడానికి, మొక్కలు పంపిణి ,చేసి మొక్కలు నాటేందుకు, మూడేళ్ల మొక్కల సంరక్షణకు ప్రొత్సాహక నగదు ఇస్తున్నారు. ఆదాయం సమకూర్చే అంతర పంటలు వేసుకునేందుకు ప్రోత్సహం ఇస్తున్నారు. గిరి రైతులు ఈ పంటల సాగుతో ఆర్థిక ఆదాయం పొందుతున్నారు.

– పి.బి.ఆనందరావు, పెదలబుడు గ్రామం, అరకులోయ

పెరుగుతున్న సాగు



మండలంలోని రైతులు సిల్వర్ ఓక్ మొక్కల పెంపకానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది సిల్వర్ ఓక్ మొక్కలతోపాటు మహాగని మొక్కలు కూడా రైతులకు అందిస్తున్నాం. ఈ కలపకు మార్కెట్ మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది 2,400 ఎకరాల్లో సిల్వర్ ఓక్ మొక్కలు రైతులకు పంపిణీకి లక్ష్యం కాగా, అంతకంటే ఎక్కువ మొక్కలు నాటేందుకు గిరిరైతులు ముందుకు వస్తున్నారు. సిల్వర్ ఓక్ మొక్కలు వేసిన మూడేళ్ల తరువాత కాఫీ, మిరియాలు వేసుకోవాలి. వాటితో పాటు కాఫీ, సపోట, నిమ్మ, జీడి మామిడి సాగు చేసుకోవచ్చు.

– జగదీశ్వరరావు, ఏపీవో, అరకులోయ మండలం

ఉత్తమ సేవలతో గుర్తింపు


వై.రామవరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలుసభ

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బదిలీపై వెళ్తున్న డిప్యూటీ ఎంపీడీవో డి.శివకుమార్‌కు కార్యాలయంలో గురువారం వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ సేవలందించిన వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. బదిలీపై వెళ్తున్న శివకుమార్‌కు వీడ్కోలు పలుకుతు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరాజుకు స్వాగతం పలికారు. వారిద్దరికి శాలువాలు కప్పి, పూల మాలలు వేసి సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

సీలేరు: సీలేరు పంచాయతీలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పాంగి దుర్గో, సచివాలయ కార్యదర్శి పరశురాం, ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి ఆధ్వర్యంలో జరిగింది. గ్రామ సభలో పలువురు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమన్నారు. ఉప సర్పంచ్ వల్లి ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


కోసంగి పనసపుట్టు గ్రామంలో గ్రామస్తులతో మాట్లాడుతూన్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ కోసంగి పనసపుట్టు గ్రామంలో సీఐ హిమగిరి, ఎస్ఐ పాపినాయుడు, గురువారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ హిమగిరి మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, అమ్మకాలు వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశమవుతాయన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబర్చాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు ఆస్పత్రిని సీహెచ్‌సీగా ప్రకటించాలి


శ్రీనివాస్

సీలేరు: జెం కొత్తవీధి మండలం సీలేరు లేక దారకొండ పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా ప్రకటించాలని జిల్లా డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్ అధికారులను కోరారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతానికి 70, కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ మేరకు సీలేరు, ధారకొండ పీహెచ్‌జీలో ఏదో ఒకటి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా ప్రకటిస్తే ఇటు మంగంపాడు, సీలేరు, దారకొండ రోగులకు సులువుగా ఉంటుందన్నారు. ఈ ప్రాంతం నుంచి చింతూరు సీహెచ్‌సీకి వెళ్లాలంటే 90కిలోమీటర్లు లేక చింతపల్లి వెళ్లేందుకు 70 కిలోమీటర్ల ఘాట్ రోడ్డులో 80 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లోని రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఆస్పత్రులకు వెళ్లేందుకు రోగులకు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన


కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

వై.రామవరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని, దీంతో జీవితాలు నాశనమవుతాయన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల అనారోగ్యంపై కలిగే దుష్ప్రభావాలను ఆయన వివరించారు. గుట్కాలు, ఖైనీలు వంటివి తీసుకోవడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు సెలవులకు గ్రామాలకు వెళ్లినపుడు కుటుంబసభ్యులు, స్థానికులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. సారా, కోడిపందాలు, గంజాయి సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. పాఠశాలలకు దగ్గరలో మత్తు పదార్థాలు విక్రయించే దుకాణాలు పెట్టనివ్వవద్దని ప్రిన్సిపాల్, సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో ఏ విధమైన మత్తు పదార్థాలు, గుట్కాలు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణ యజమానులను ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పరశురామ్, నాయకులు

డుంబ్రిగుడ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోసాలు, అరాచక పాలనపై ప్రజలను వివరించేందుకు పంచాయతీతో పాటు గ్రామ కమిటీలు ఏర్పాటుచేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పరశురామ్, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు చెప్పారు. మండలంలోన పార్టీ నాయకులతో వారు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఎన్నికల హామీలు అమలుచేయడం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచకాలు, అక్రమ అరెస్టులు, ప్రజా వ్యతిరేక పాలనపై గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ నాయకులు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న పాలనలో సంక్షేమం, అభివృద్ధి, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలుచేయని సూపర్‌సిక్స్ పథకాలు తదితర అంశాలను గ్రామస్తులకు విస్తృతంగా తెలియజేస్తామన్నారు. గుంటసీమ, సొవ్వా సర్పంచ్‌లు గుమ్మ నాగేశ్వరరావు, అశోక్, తూటంగి ఎంపీటీసీ సభ్యుడు రామారావు, పోతంగి వైస్ సర్పంచ్ శెట్టి జగ్గునాయుడు, నాయకులు బాకా సింహాచలం, సీహెచ్.కృష్ణారావు, నరసింగరావు, మాజీ ఎంపీటీసీ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ తిరుమలరావు

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో సేంద్రియ వ్యవసాయ సాగు చేపట్టే విధంగా ప్రతి ఒక్క రైతునూ అవగాహన పర్చవలసిన అవసరం ఉందని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వి.తిరుమలరావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం చింతపల్లి ఉద్యానవన పరిశోధన స్థానంలో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో మూడు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏడీ తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుతం సేంద్రియ వ్యవసాయ పంటలతో ఆరోగ్యకర పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో జీవ, ఘనామృతంతో పంటలు సాగు చేపట్టే విధంగా క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి టి.మధుసూదనరావు, ప్రకృతి వ్యవసాయ శిక్షకులు బాబూజీ, డివిజన్ ఇన్‌చార్జి వెంకట్, చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాలు వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి


ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి (అరకులోయ టౌన్): విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని పెదబిడ్డ, టోకూరు, అనంతగిరి-2 ఆశ్రమ పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. మెనూ ప్రకారం రుచికరంగా ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలని వంట నిర్వాహకులు, వసతి గృహాల వెల్ఫేర్ అధికారులకు సూచించారు. విద్యార్థుల మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని వసతిగృహ నిర్వాహకులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాగి అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పాడి కృష్ణమూర్తి, సర్పంచ్‌లు సన్యాసిరావు, పెంటమ్మ, రాములమ్మ, ఎంపీటీసీ సభ్యులు మిథుల తదితరులున్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాయం రంగమ్మ


కూనవరం: ఉపాధి హామీ పథకం బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని, కొద్దిపాటి వర్షానికే పాఠశాలల గదుల్లో నీరు చేరుతుందని కురుస్తున్నాయని సభ్యులు అధికారులను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ వరద బాధితుల పునరావాస కేంద్రాల్లో తాగునీటి బోర్లు ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు అభ్యంతరాలు తెలపడం సరైంది కాదన్నారు. వరదల సమయంలో ఎమర్జెన్సీ రోడ్లు నిర్మాణంలో అటవీశాఖ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు ఇప్పటికైనా స్పష్టత ఇవ్వాలని కోరారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ త్వరలో ఆ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. ముంపులో లేని భూములకు పట్టాలు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యం వల్ల అన్నదాత పథకానికి రైతులు అర్హత కోల్పోతున్నారని సభ్యులు మండిపడ్డారు. పోలవరం నిర్వాసితులకు అనువైన స్థలాలు కేటాయింపు సమస్యను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సభ్యులు తెలిపిన సమస్యలన్నింటిని సకాలం పూర్తి చేయాలని ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీవో జగన్నాథం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జల్లి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండు మండలాల ప్రకటన హర్షణీయం


సమావేశంలో పాల్గొన్న మండల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

వై.రామవరం: అతి పెద్ద విస్తీర్ణం గల వై.రామవరం మండలాన్ని రెండు మండలాలుగా చేయడానికి కలెక్టర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి తదితరులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వై.రామవరం మండలంతో పాటు రెండవ మండలంగా గుర్తేడును ప్రకటించడం హర్షణీయమన్నారు. ప్రస్తుతం మండలంలో ఉన్న 17 పంచాయతీల్లో గుర్తేడు, పాతకోట, దారగడ్డ, కానివాడ, బొడ్డగం పేదు పంచాయతీలు మండల కేంద్రమైన వై.రామవరంనకు బహుదూరంలో ఉన్నాయన్నారు. ఆయా పంచాయతీల ప్రజలు మండల కేంద్రానికి వచ్చేందురకు మారేడిమిల్లి, రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల మండలాలు దాటుకుంటు సుమారు 150 కిలోమీటర్ల దూరం చుట్టు తిరిగివస్తున్నారని, చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుర్తేడును మరో మండలంగా చేయడానికి ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. వేగవంతంగా మండలాన్ని విడదీయాలని వారు కోరారు. అలాగే ప్రజా సమస్యలు గుర్తించి, మండలాన్ని రెండుగా విడదీయడానికి ఈ నిర్ణయం తీసుకున్న కలెక్టర్ దినేష్ కుమార్, ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ లకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాయకులు కరణం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉత్తమ భవిష్యత్తు


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : చెడు అలవాట్లకు బానిసలైపోకుండా కష్టపడి చదువుకుంటే కీర్తి ప్రతిష్టలొస్తాయని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. మండంలో వేములపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు పోక్సో చట్టం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, రోడ్డు ప్రమాదాల నివారణ, శక్తి యాప్ ప్రయోజనాలపై విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల భద్రత కోసం పోక్సో చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. బలవంతంగా బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల నుంచి సమాజాన్ని పూర్తిగా విముక్తి చేయడమే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు.

శక్తి యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్ఐ రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన


డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మీ

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ చోటముఖిపుట్టు, రాతులపుట్టు, నడుమూరు, జంగంసరియా గ్రామాల్లో గురువారం జెడ్పీ నిధులు రూ.20లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ సిరగం నరసింగరావు, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి సుబ్బలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు జె.వి.వి.ఎస్.మూర్తి తదితరులు ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మిలు మాట్లాడుతూ పంచాయతీల్లో డ్రైనేజీ సమస్యతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై ఆమె స్పందించి ఈ మేరకు నాలుగు గ్రామాల్లో డ్రైనేజీల కోసం రూ.5.20లక్షల చొప్పున మంజూరు చేశారన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో త్వరలో డ్రైనేజీ సమస్య పరిష్కారం కానున్నట్టు వారు హర్షం వ్యక్తం చేశారు.

వరి నారుమడిలో జింక్ లోపం

అనకాపల్లి: వరి నారుమడిలో జింక్ లోపం వచ్చే అవకాశం ఉందని, జింక్ సల్ఫేట్ ఐదు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.బి.రంగాచారి తెలిపారు. సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు ఆధ్వర్యంలో మార్టూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసానికి యూరియా వాడటం వల్ల పశువులు, మనుషులు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. పొలాన్ని దమ్ము చేసే టప్పుడు ఒక బస్తా డీఏపీ, 20 కేజీలు పొటాషియం వేసినట్లయితే వరి దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రావణి, జోత్స్న పాల్గొన్నారు.